సాక్షి చిత్తూరు

బుధవారం । 29 । జనవరి । 2025



కబడ్డీ పోటీల్లో మెరిసిన జిల్లా జట్టు

అంతరజిల్లా కబడ్డీ పోటీల్లో జిల్లా పురుషుల జట్టు ద్వితీయ స్థానం, బాలికల జట్టు తృతీయ స్థానం దక్కించుకున్నారు. - 8లో



వీఓఏలపై వేధింపులు మానుకోవాలి

వీఓఏలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని దీక్ష చేపట్టారు. - 8లో



నకి'లీలలు'

చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఫోర్జరీ వ్యవహారం కలకలం రేపుతోంది. తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

ఏఆర్ పోలీసులకు వృత్యంతర శిక్షణ



మాట్లాడుతున్న ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని జిల్లా ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) పోలీసులకు వృత్యంతర శిక్షణ మంగళవారం ప్రారంభమయింది. నగరంలోని ఏఆర్ మైదానంలో పది రోజుల పాటు నిర్వహించనున్నారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్ మాట్లాడుతూ.. ఏటా జరిగే శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి పరేడ్ మెళకువలు, భద్రతా పరమైన అంశాలు, ఆయుధాల వాడకం, ఫైరింగ్, బందోబస్తు డ్యూటీలపై పునఃసమీక్షించి సాయుధ బలగం సన్నద్ధతపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. పోలీసుశాఖకు బలమైన ఏఆర్ విభాగాన్ని మరింత పటిష్టం చేస్తామన్నారు. మోటారు రవాణా విభాగం, భద్రతా విభాగం, గన్‌మెన్‌లు, డాగ్ స్క్వాడ్ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీకి కలెక్టర్ అభినందన



పీఈటీ సురేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఖోఖో వరల్డ్ కప్ పోటీల్లో జిల్లా తరఫున టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించిన పీఈటీ సురేష్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఖోఖో పోటీల్లో జిల్లా నుంచి టెక్నికల్ అఫీషియల్‌గా పాల్గొనడం గర్వకారణమన్నారు.

సీనియారిటీ జాబితా అప్‌డేట్ చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల ఉద్యోగోన్నతులకు సీనియారిటీ జాబితాను అప్‌డేట్ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం డీఈఓ కార్యాలయానికి అందాయి. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ స్కూల్స్‌లోని టీచర్ల సీనియారిటీ జాబితాలను అప్‌డేట్ చేయాలన్నారు. పకడ్బందీగా ప్రక్రియ పూర్తి చేసేలా డీఈఓ చర్యలు చేపట్టాలని సూచించారు.

ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, ఎఫ్ఎన్ఓ ప్రొవిజినల్ జాబితా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, ఎఫ్ఎన్ఓ పోస్టుల భర్తీలో భాగంగా ప్రొవిజినల్ మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచామని డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి తెలిపారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలుంటే ఫ్రిబవరి 4వతేదీలోపు కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఉచిత ప్రసాదం రుచిగా ఉండాలి



ప్రసాదం పంపిణీని పరిశీలిస్తున్న ఈఓ పెంచలకిషోర్

కాణిపాకం : భక్తులకు అందించే ప్రసాదం రుచిగా ఉండాలని ఈఓ పెంచల కిషోర్ అన్నారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అందించే ఉచిత ప్రసాదాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. భక్తులకు పరిశుభ్రంగా, రుచికరంగా ప్రసాదం అందించాలన్నారు. సకాలంలో ప్రసాదం పంపిణీ చేయాలన్నారు. భక్తుల సంఖ్య పెరిగితే అందుకు తగ్గట్లు ప్రసాద వితరణ జరగాలని ఆయన ఆలయ అధికారులకు ఆదేశించారు.

చెదిరిన సొంతింటి కల

బడుగుల సొంతింటి కల గాలిలో దీపంలా మారిపోయింది. ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేదల గూడు ఘోషిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్లు పథకం పేరును మన ఇళ్లు – మన గౌరవంగా మార్చింది. బిల్లులు సమయానికి ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు తీవ్రంగా మండిపడుతున్నారు. పక్కా గృహాలపై కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పేదల గూడుపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఏడు నెలలుగా కనిపించని ఇళ్ల నిర్మాణాల పురోగతి
- సకాలంలో విడుదల చేయని నిధులు
- గత సర్కారులో వేల మందికి ఇళ్ల పట్టాలతో సహా ఉచిత ఇళ్ల నిర్మాణాలు



అసంపూర్తిగా దర్శనమిస్తున్న పద్మ సరస్సు లే అవుట్‌లోని ఇళ్లు

జిల్లాలోని హౌసింగ్ లే అవుట్‌లు	: 609
గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు	: 77,366
వైఎస్సార్‌సీపీ సర్కారు పూర్తి చేసిన ఇళ్లు	: 46,163
పెండింగ్‌లో ఉన్న గృహాలు	: 31,203
జూన్ నుంచి డిసెంబర్ వరకు పూర్తి చేయాల్సిన ఇళ్లు	: 6,719
కూటమి సర్కారు డిసెంబర్ వరకు పూర్తి చేసిన గృహాలు	: 2,389
ఇంకా పూర్తి చేయాల్సిన ఇళ్లు	: 4,330
గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు ఖర్చు చేసిన మొత్తం రూ.(కోట్లు)	: 1000.687

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పేదలకు కేటాయించిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడంలో టీడీపీ కూటమి సర్కారు అలసత్వం చూపుతోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో సొంతిళ్లు లేని పేదల కోసం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకాన్ని అమలు చేసింది. ఇందులో ఉచితంగా లక్షల విలువ చేసే ఇంటి స్థలంతో పాటు ఉచితంగా ఇంటి నిర్మాణం చేసుకునేలా అవకాశం కల్పించింది. గత అయిదేళ్ల పాటు జిల్లాలో కేటాయించిన ఇళ్ల నిర్మాణాల పురోగతి సజావుగా సాగింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్ల పథకాన్ని నీరుగార్చింది. ఎన్నో ఆశలతో సొంత ఇళ్లు నిర్మించుకుంటున్న పేదల కడుపు కొట్టింది. జిల్లా వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై టీడీపీ కూటమి సర్కారు నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా చిత్తూరు, కుప్పం, పలమనేరు, పూతలపట్టు, నగరి, జీడీ నెల్లూరు, పుంగనూరులో పేదలందరికీ ఇళ్ల పథకం అటకెక్కింది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తికాక అవస్థలు పడుతున్నారు.



పైన కనిపిస్తున్న చిత్రం నగరి నియోజకవర్గం విజయపురం లేఔట్. ఇక్కడ 95 మంది లబ్ధిదారులకు ఉచిత గృహాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఎన్నికలకు ముందు వరకు 64 గృహాలను పూర్తి చేశారు. కూటమి టీడీపీ ప్రభుత్వం ఏడు నెలలుగా 31 గృహాలను పూర్తి చేయలేక అలసత్వం వహిస్తోంది. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో లే అవుట్‌లో వివిధ దశల్లో 31 మంది లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసుకోలేకపోతున్నారు.

పథకంలోనే గౌరవం.. క్షేత్రస్థాయిలో అవమానం

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగమేఘాలపై పేదలందరికీ–ఇళ్ల పథకం పేరును మన ఇళ్లు–మన గౌరవంగా మార్చేశారు. పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ పేదలు గౌరవంగా భావిస్తున్న సొంతింటి నిర్మాణాలకు నిధులు ఇవ్వడంలో శ్రద్ధ చూపలేదు. సీఎం సొంత జిల్లాలోనే ఇళ్ల నిర్మాణాల పురోగతిని తుంగలో తొక్కేశారు. నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు విడతల వారిగా చెల్లించాల్సిన బిల్లుల్లో జాప్యం చేస్తున్నారు. అరకొర చెల్లింపులతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. బిల్లులు సమయానికి ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు సొంతింటి నిర్మాణాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వైపు నిర్మాణాలు పూర్తి చేయించేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారుల వెంట పడుతున్నారు. దాంతో బిల్లులు అందకపోయినా అప్పులు చేసి లబ్ధిదారులు పనులు చేపడుతున్నారు.

బిల్లులందక వేదన

టీడీపీ కూటమిలో సొంత ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులు అందక వేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో గత వైఎస్సార్‌సీపీ సర్కారు పేదల ఇంటి నిర్మాణాలకు 609 లే అవుట్‌లను ఏర్పాటు చేసింది. అందులో 77,366 మందికి కులం, మతం, వర్గం, పార్టీ తేడా లేకుండా అర్హులైన పేదలకు ఇంటి పట్టాతో పాటు గృహ నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో వేల మంది సొంతంగా రూ.లక్షల విలువ చేసే ఇళ్ల పట్టాలను పొందారు. లబ్ధిదారులకు చెల్లించాల్సిన బిల్లుల కోసం సంబంధిత డీఈ, ఈఈలు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేవారు. వీటిని పరిశీలించి ఉన్నతాధికారులు తక్షణమే బిల్లులు మంజూరు చేసేవారు. ఈ ప్రభుత్వంలో ఏడు నెలలుగా అరకొరగా బిల్లులే చెల్లిస్తున్నారు. గత పాలనలో బిల్లులు సకాలంలో వచ్చేవని లబ్ధిదారులు చెబుతున్నారు.

బిల్లులు ఇవ్వడం లేదు



మాది నగరి నియోజకవర్గం విజయపురం గ్రామం. గత వైఎస్సార్ ప్రభుత్వంలో విజయపురం లే అవుట్‌లోని జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేశారు. ఉచితంగా ఇంటి పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణం ప్రారంభించిన మొదట్లో బిల్లులు సకాలంలో వచ్చేవి. ఆలోపే ఎన్నికలు రావడంతో తర్వాత బిల్లులు రాలేదు. ఇప్పుడున్న ప్రభుత్వం బిల్లు ఇస్తుందో లేదో అర్థం కావడం లేదు. పెండింగ్ బిల్లు ఇస్తామని, నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నా పనులు చేపట్టేందుకు మాకు ధైర్యం చాలడం లేదు.

– సుగుణమ్మ, లబ్ధిదారురాలు, విజయపురం మండలం, నగరి నియోజకవర్గం

బకాయిలు విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెండింగ్ బిల్లులే ఇవ్వలేదు. బిల్లులు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. అధికారులను అడిగితే ఇల్లు పూర్తి చేయండి తర్వాత ఇస్తామని చెబుతున్నారు. ఇల్లు పూర్తి చేయాలంటే డబ్బు చేతిలో ఉండాలి కదా. గతంలో సకాలంలో బిల్లులు ఇస్తుండడంతో త్వరగా ఇంటి పనులు చేపట్టాం. ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో చివరి దశలో ఇంటి పని ఆగిపోయింది. చేతిలో డబ్బు లేక ఇల్లు పూర్తి చేయలేకపోతున్నాం.

– హైమావతి, లబ్ధిదారురాలు , తవణంపల్లె మండలం, పూతలపట్టు నియోజకవర్గం

అప్పులు చేసి ఇల్లు నిర్మించా...



కార్వేటినగరం మండలం పద్మ సరస్సు లే అవుట్‌లో నాకు గత ప్రభుత్వం సొంత ఇంటిని మంజూరు చేసింది. నేను 25 ఏళ్ల కిందట పద్మసరస్సు ఎస్టీ కాలనీలో వివాహం చేసుకొని అద్దె ఇంటిలో ఉంటున్నాం. గత ప్రభుత్వం పుణ్యమా అని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి పట్టా, సొంతంగా ఇల్లు మంజూరు చేసింది. ప్రస్తుతం బిల్లులు సకాలంలో రాకపోవడంతో పూత పని ఆగిపోయింది. అప్పులు చేసి పూర్తి చేశా. ఇప్పటి వరకు బిల్లు మంజూరు చేయలేదు.

– పయని, లబ్ధిదారుడు, కార్వేటినగరం మండలం, గంగాధర నెల్లూరు నియోజకవర్గం

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి



మాది పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం. జగనన్న పుణ్యమా అని గత ప్రభుత్వంలో సొంత ఇంటి పట్టాతో పాటు గృహాన్ని మంజూరు చేశారు. లక్షల విలువ చేసే స్థలాన్ని ఉచితంగా నా భార్య ఆశ పేరుతో పట్టా ఇచ్చారు. గత ప్రభుత్వమే లేకపోతే ఎప్పటికీ ఇల్లు కట్టుకునే వాళ్లం కాదు. చాలా ఏళ్లుగా అద్దె ఇంట్లోనే గడుపుతున్నాం. గత ప్రభుత్వంలో ఇంటి పని ప్రారంభించినప్పటి నుంచి బిల్లులు విడతల వారీగా అందేవి. చివరి దశ బిల్లు ఆగిపోయింది.

– శ్రీధర్, వి.కోట మండలం, పలమనేరు నియోజకవర్గం

గ్రామ కంఠం భూమి రిజిస్ట్రేషన్

- ఫోర్జరీ సంతకంతో కానిచ్చిన వైనం
- బాధితుడి ఫిర్యాదుతో కేసు
- నిందితుడు టీడీపీ నేత

గంగాధర నెల్లూరు : ఫోర్జరీ సంతకంతో గ్రామ కంఠం భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మహదేవ మంగళంలోని గ్రామ కంఠం భూమిని సర్వేయర్ గుణశేఖర్ సంతకం ఫోర్జరీ చేసి అధికారులను ఏ మార్చిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ శ్రీనివాసంతి వివరాల మేరకు.. మహదేవ మంగళానికి చెందిన సోమాచారి కుమారుడు పట్టాభి ఆచారి తన భూమి కబ్జాకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని టీడీపీకి చెందిన నటరాజ మొదలి తన భూమిని కబ్జా చేసేందుకు కుట్ర పన్ని అధికారులను తప్పుదోవ పట్టించి, బాధితుడు గుర్తించే లోపు ఆ భూమిని ఫోర్జరీ సంతకాలతో దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేసుకొని అమ్మి సొమ్ము చేసుకున్నాడు. ఈ అక్రమాలపై గంగాధర నెల్లూరు పోలీసులకు బాధితుడి ఫిర్యాదు మేరకు మహదేవ మంగళకు చెందిన నిందితులు ఏ–1గా ఎస్ఎస్ నటరాజ్ మొదలి, ఏ– 2గా శంకర్ రెడ్డి, ఏ–3గా రంగమ్మ, తవణంపల్లి మండలం, ఎంజీ పల్లికు చెందిన ఏ–4గా ఎన్. భాస్కర్, ఏ–5గా సుబ్రమణ్యం, ఏ – 6గా గంగాధర్‌రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విషయాన్ని గుర్తించిన బాధితుడు పట్టాభి ఆచారి గ్రామ సర్వేయర్ గుణశేఖర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించి అమ్మేసిన విషయాన్ని చిత్తూరు సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించి తనకు జరిగిన అన్యాయాన్ని, వాస్తవాలను వివరించారు. కాగా సబ్ రిజిస్ట్రార్ ఈ రెండు రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసినట్లు బాధితుడికి తెలిపారు. బాధితుడు పట్టాభి ఆచారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చారి సీఐ శ్రీనివాసంతి తెలిపారు.



ఫోర్జరీ చేసిన పత్రం

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా



రాత్రిపూట గ్రావెల్ తరలిస్తున్న తమిళనాడు టిప్పర్

విజయపురం : మండలంలోని మహారాజపురం నుంచి తమిళనాడుకు రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు జరుగుతోంది. క్వారీ నుంచి కనకమ్మ సత్రం వరకు మార్గ మధ్యలో మహారాజపురం దళితవాడ, గ్రామాలు రోడ్డును ఆనుకునే ఉన్నాయి. గ్రామస్థులు, ఆడుకునే పిల్లలు ఈ ప్రాంతాల్లో నిత్యం సంచరిస్తూ ఉంటారు. రాత్రిపూట వందల సంఖ్యలో తమిళనాడుకు చెందిన గ్రావెల్ లారీలు తిరగడం ప్రమాదకరంగా మారింది. ఇటీవల జగన్నాథపురంలో గ్రావెల్ తరలిస్తుండగా ఒక ఉపాధి కూలీని ఢీకొనడం అతని కాలికి తీవ్ర గాయమైన ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరుగుతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, అధికారులు

- సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి

చిత్తూరు కలెక్టరేట్ : మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో మానవ అక్రమ రవాణా నుంచి మహిళలు, పిల్లలకు రక్షణ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ మాట్లాడుతూ.. సమాజంలో మానవ అక్రమ రవాణా మితిమీరిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో దారితప్పుతున్నారని, ఈ విషయంలో తల్లిదండ్రులు మరింత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విషయాలను చిన్నప్పటి నుంచే నేర్పించాలన్నారు. పిల్లల అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మహిళ, శిశు సంక్షేమ హక్కులపై అవగాహన ఉండాలని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులు అక్రమ రవాణా కట్టడిపై అవగాహన అవసరమన్నారు. దిశా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ విజయశేఖర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో దిశా ఎస్ఐ నాగసౌజన్య, ఐసీడీఎస్ నోడల్ అధికారి జయంతి, డీసీపీఓ సుబ్రహ్మణ్యం, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- విధుల్లో అలసత్వం వహిస్తే వేటు
- పర్యాటక అభివృద్ధికి చర్యలు
- వరుస సమావేశాల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు ప్రతి నెలలో 4 రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్, వసతిగృహాలు, ఆస్పత్రులు , సచివాలయాలు, సంబంధిత కార్యాలయాలన్నింటినీ పరిశీలించాలన్నారు. పర్యటనలతో సిబ్బంది పని తీరును అంచనా వేయవచ్చన్నారు. పనితీరులో లోపాలు ఉన్నట్లయితే గుర్తించి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్డీఓలు కేవలం రెవెన్యూ అంశాలపైనే కాకుండా అన్ని కార్యాలయాల పని తీరును పరిశీలించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

పర్యాటక అభివృద్ధికి చర్యలు

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్న ప్రాంతాలను గుర్తించి భూసేకరణ చేపట్టాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన భూములను సంరక్షించే బాధ్యతతో టూరిజం, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ఉపాధి పథకం లో మంజూరైన రోడ్లు వేసేందుకు అనుకూలమా లేదా అన్న విషయాన్ని పంచాయతీ అధికారులు టూరిజం అధికారులతో కలసి పరిశీలించాలని కోరారు. కుప్పం పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధిలో ననియాల ఎకో టూరిజం, మల్లప్ప కొండలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చేవారిని గుర్తించాలన్నారు. సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్ఓ మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీఈఓ వరలక్ష్మి, పర్యాటక శాఖ ఆర్ఎం రమణప్రసాద్, జిల్లా టూరిజం అధికారి మల్లికార్జున, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఆర్‌లో ఇద్దరు ఉద్యోగుల బదిలీ

చిత్తూరు కార్పొరేషన్ : పంచాయతీరాజ్ (పీఆర్) ఈఈ కార్యాలయంలో ఏఓ, సీనియర్ సహాయకులను మంగళవారం బదిలీ చేస్తూ జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటేషన్‌పై జిల్లా బీసీ సంక్షేమశాఖకు పంపించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వీరు చిత్తూరులోని ఈఈ కార్యాలయానికి వచ్చారు. ఏమి జరిగిందో ఏమో కానీ పీఆర్‌లోని ఓ అధికారికి వీరికి పొసగడం లేన్నట్లు సమాచారం. గత కొంత కాలంగా వీరి మధ్య సఖ్యత లేక పోవడంతో వారిని మార్పు చేయాలని ఆ అధికారి కంకణం కట్టుకున్నారు. సీఈఓపై ఒత్తిడి తెచ్చి బదిలీ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గురుకుల టీచర్‌కు తీవ్ర గాయాలు

గంగాధర నెల్లూరు : రోడ్డు ప్రమాదంలో గురుకుల పాఠశాల టీచర్ తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలో జరిగింది. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల మేరకు. గుడిపాలలో ఎంపీడీఓ కార్యాయలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుభాష్ చంద్రబోస్ తన భార్య సుధామయిని గంగాధర నెల్లూరు మండలం సర్విరెడ్డిపల్లె వద్ద గల గురుకుల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది.ఈ క్రమంలో తన బైక్‌లో ఆమెను ఎక్కించుకొని ఇద్దరూ తాళంబేడుకు హైవే రోడ్‌లో సోమవారం రాత్రి వెళుతుండగా కండిగ వద్ద కుక్క అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించబోయి బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులు కిందపడ్డారు. దీంతో టీచర్ సుధామయికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఆమె భర్త సుభాష్ చంద్రబోస్ స్వల్పంగా గాయపడ్డాడు. ఆమె కొన్ని నెలల పాటు నడవలేని స్థితి ఏర్పడినట్లు వైద్యులు పేర్కొన్నారని తెలిపారు.

చిత్తూరులో చైన్ స్నాచింగ్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో చైన్ స్నాచింగ్ జరగడంపై మంగళవారం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కొంగారెడ్డిపల్లిలోని ఎస్ బీఐ కాలనీకి చెందిన మల్లికార్జున రావు సోమవారం రాత్రి మార్కెట్‌కు వెళ్లి తన భార్యతో కలిసి ఇంటికి నడుస్తూ వెళుతున్నారు. ఈ సమయంలో ముఖానికి మాస్క్ వేసుకున్న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మల్లికార్జున రావు భార్య మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. 25 గ్రాముల బరువు ఉన్న బంగారు గొలుసు చోరీకి గురైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నకిలీలలు

చిత్తూరు జిల్లాల్లో ఫోర్జరీ వ్యవహారం రోజు రోజుకు దుమారం రేగుతోంది. తవ్వేకొద్దీ అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తుండడంతో విచారణ అధికారులే విస్తుపోతున్నారు. కార్యాలయ ఇంటి దొంగలు నకిలీ కేటుగాళ్లకు అండ దండలు లేకుండానే ఇంత పెద్ద ఎత్తున నకిలీ పత్రాలు సృష్టించడం..రూ.కోట్లు దండుకోవడం సాధ్యమయ్యే పనికాదు. ప్రైవేటు వ్యక్తులకు తోడుగా కార్యాలయ ఇంటి దొంగల ప్రమేయంపై విచారణ సాగుతున్నట్లు సమాచారం. విచారణ లోతుగా సాగితే కూటమి నేత తమ్ముడి నకిలీలలతో పాటు వెనుక ఉండి నడిపిస్తున్న శక్తులు ఎవరో బయటపడే అవకాశం లేకపోలేదు.

- కదులుతున్న ఫోర్జరీ పంజా
- వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- ఒక్క సర్టిఫికెట్‌తో మొదలై రూ.కోట్లలో భూపత్రాల సృష్టి

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఫోర్జరీ పంజా విసురుతోంది. తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. ఎంజాయిమెంట్ సర్టిఫికెట్‌ను పక్కన పెడితే ఇరువారం, ప్రశాంత్‌నగర్, తదితర ప్రాంతాల్లో అధికారుల ఫోర్జరీ సంతకాలతో పదుల సంఖ్యలో పత్రాలు పుట్టుకొచ్చినట్లు సమాచారం. డీకేటీ భూములు, పట్టాలను ఎరవేసి కాసులు దండుకోవడానికి ప్రైవేటు వీఆర్‌ఏలు ఈ ధందా నడిపించారనే విమర్శలున్నాయి. వీరి చేతికే భూ సంబంధిత ప్రభుత్వ లాగిన్‌లు ఇవ్వడంతో 2018–19 మధ్య కాలంలో పలు సర్వే నంబర్లను ప్రైవేటు వీఆర్‌ఏల బంధువుల పేర్లకు మార్చుకున్నారని కార్యాలయ సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. ఎలాంటి రికార్డులు లేకుండా అలా ఆన్‌లైన్‌లోకి సర్వే నంబర్లను చేర్చడంపై కార్యాలయంలో విమర్శలు వెలువెత్తుతున్నాయి. వీరు అప్పట్లో అధికారులను చేతిలో పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఇక పెరుమాళ్లకండ్రిగ, వరదరాజులపల్లిలో విలువైన భూములను రూ.లక్షల్లో నగదు తీసుకుని ఓ వ్యక్తికి అంటకట్టినట్లు సమాచారం. ఇందులో కూడా ఆ ప్రైవేటు వ్యక్తే కీలకంగా వ్యవహరించారని సిబ్బంది గుసగుసలాడుతున్నారు... (text as printed: ఫూస గుచ్చినట్లు చెబుతున్నారు). భూ దానం తర్వాత ఆ ప్రైవేటు వ్యక్తికి కారు బహుమానంగా ఇచ్చారని వినికిడి. ఇలా పదుల సంఖ్యలో ఫోర్జరీ సంతకాలు, మధ్యవర్తిగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడినట్లు జోరుగా చర్చ నడుస్తోంది.

ఫోర్జరీ విచారణలో కొన్ని అంశాలు ..

అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసిన కలావతి సంతకం ఫోర్జరీ చేశారనే విషయం తెలిసిందే. దీనిపై గుర్తుతెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ దొంగల ముఠాను పట్టుకోవడానికి గోప్యంగా విచారణ చేపట్టారు. తహసీల్దార్ ఫిర్యాదుతో తొలుత ముగ్గురు వీఆర్‌ఏలను విచారించారు. ఈ విచారణలో ఓ వీఆర్‌ఏ పాత్ర ఏం లేదని తెలిసింది. కీలకంగా వ్యవహరించిన మరో వీఆర్‌ఏను విచారిస్తే..తాను పత్రం మాత్రమే తీసుకొచ్చానని.. తహసీల్దార్, ఇతరత్రా సంతకాలు చేసిందంతా చిత్తూరు రూరల్ మండలానికి చెందిన ఓ ప్రైవేటు వీఆర్‌ఏనని పోలీసుల సమక్షంలో ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

దొంగ చేతికే తాళాలు

సర్వే నంబర్లను తారుమారు చేయడం, హద్దులను మార్చడం, ఆన్‌లైన్‌లో సర్వే నంబర్లు తొలగించడం వంటి పనులు చేస్తూ గ్రామాల్లో భూ సమస్యలను తెచ్చిపెట్టడానికి ప్రధాన కారకుడు ఆ ప్రైవేటు వ్యక్తియేనని పలువురు మండిపడుతున్నారు. ఈ వ్యక్తి చేతికి మళ్లీ అధికారం ఇస్తే...గ్రామంలో ఉన్న సమస్యలు చాలవంటూ భూ సంబంధిత సమస్యలు మరింత పెరుగుతాయని అంటున్నారు.

సీలు, సంతకాలు ఎవరివి..?

ఫైనాన్స్ సిబ్బంది తప్పుడు పత్రాలు సృష్టించి రుణాలు ఇప్పించడమే పనిగా పెట్టుకుని..ఈ ముఠాతో చేతులు కలిపి రూ.లక్షల్లో సంపాదించినట్లు సమాచారం. ఇలా ఎందుకు చేస్తున్నారు..? ఎలా చేస్తారు..? ఈ ముఠాలో ఎవరెవరు ఉన్నారు? ఎవరెవ్వరితో సంబంధాలున్నాయి ? ఇంకా ఎంత మంది ఉన్నారు? అధికారుల సంతకాలు ఏ రకంగా ప్రాక్టీస్ చేశారు..? సీలు ఇవన్నీ వీళ్లకు ఎక్కడివి..? రిజిస్ట్రార్ ఆఫీసుతో ఎలా సంబంధాలు ఉన్నాయి..? తప్పుడు పత్రాలతో ఏ రకంగా రిజిస్ట్రేషన్ చేయిస్తారు..? ఏ రకంగా లోన్లు తీసుకుంటున్నారనే అనే కోణంలోనే విచారణ లోతుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసులో తహసీల్దార్ సంతకం చేసిన ఓ వీఆర్‌ఏ (ప్రైవేటు వ్యక్తి) కూటమి నేత సోదరుడిగా కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. సోదరుడిని తప్పించడానికి ఆ కూటమి నేత అన్ని తానై వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పోలీసులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్దుబాటు చేశానని, ఎవరు ఏం చేయలేరని ఆ కూటమి నేత బహిరంగంగా చెప్పుకోవడంపై విమర్శలు చెలరేగుతున్నాయి.

తహసీల్దార్‌ను విచారణ చేసిన పోలీసులు

తహసీల్దార్ కళావతి సంతకం ఫోర్జరీపై తాలూకా పోలీసుల విచారణ కొనసాగుతోంది. మంగళవారం సంతకం ఫోర్జరీ విషయమై తహసీల్దార్ కళావతిని చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పోలీసులు విచారణ చేశారు. సంతకం ఫోర్జరీ అయిందని ఎలా తెలిసింది? ఎవరి ద్వారా సమాచారం వచ్చిందనే ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనుమానిత వ్యక్తులపై ఆరా తీశారు. ఇప్పటి వరకు ఐదుగురిని విచారణ చేసినట్లు పోలీసులు తెలిపారు. త్వరలో ఈ కేసు సంబంధించి పలువురిని అరెస్టు చూపించినట్లు తెలుస్తోంది.

కూటమి నేతల అక్రమాలు ఆపండి

అధికారులకు ఫిర్యాదు చేసిన బీసీ ఫ్రంట్ నేత

పలమనేరు : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కూటమి నేతలు ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారని బీసీ ఫ్రంట్ నాయకులు పూలే గోవిందుస్వామి స్థానిక తహసీల్దార్ ఇన్బునాథన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కాలనీలోని ఆఖరి వీధిలో కొంత మేర పభుత్వ ఖాళీ స్థలాలున్నాయని వీటిపై కన్నేసిన నాయకులు రియల్ ఎస్టేట్‌లా అమ్మకాలు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో కొందరు లబ్ధిదారులు పొందిన స్థలాల్లో పునాదులు వేసి ఆపై బిల్లులందకనో లేక ఆర్థిక ఇబ్బందులతో వాటిని ఇంకా నిర్మించలేదన్నారు. ఇలాంటి వాటిపై కన్నేసిన కూటమి నేతలు జేసీబీలతో వాటిని చదును చేసి కావాల్సిన వారికి సెంట్ల లెక్కన అమ్ముతున్నారని ఆరోపించారు. సాక్ష్యాలతో సహా పత్రాలు సమర్పించినందున వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయకుంటే జిల్లా అధికారుల ముందు పోరాటానికి సిద్ధంగా ఉన్నానని ఆయన హెచ్చరించారు.



తహసీల్దార్ ఇన్బునాథన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న, గోవిందుస్వామి

కబడ్డీలో మెరిసిన జిల్లా జట్టు



తృతీయ స్థానం సాధించిన బాలికల జట్టు

- పురుషుల విభాగంలో ద్వితీయ, బాలికలకు తృతీయ స్థానం

పుంగనూరు : అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో చిత్తూరు జిల్లా పురుషుల విభాగానికి ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నట్లు కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లా పోటీలు చోడవరం అంకుపాళెంలో సోమవారం రాత్రి ముగిశాయన్నారు. ఈ పోటీల్లో జిల్లా జట్లు ద్వితీయ , తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నా యని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

సూపర్‌సిక్స్ హామీల మోసకారి

- చంద్రబాబు నైజం ప్రజలను వంచించడమే
- ధ్వజమెత్తిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : ఎన్నికలు సమయానికి చంద్రబాబుకు హామీలు గుర్తుకొస్తాయని, ఎన్నికలు అయిపోయిన తరువాత హామీలు గుర్తుకురావని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. మంగళవారం 'సాక్షి'తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ హామీలను నేరవేర్చలేనని మాట్లాడడం చూస్తుంటే, చంద్రబాబుకు రాజకీయ విలువలు, విశ్వసనీయత లేవని స్పష్టంగా తెలుస్తున్నాయని ఆరోపించారు. హామీలను నెరవేర్చలేనప్పుడు దొంగ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కడానికి సిగ్గు అనిపించ లేదా అని ప్రశ్నించారు. ఎల్లో మీడియా ఉన్నంత వరకు చంద్రబాబును ఎవరు ఏమి చేయలేరని, ఎందుకంటే అసత్యాలను నిజాలుగా ప్రచారం చేయడంలో చంద్రబాబుకు వంత పాడే ఎల్లో మీడియా దిట్ట అని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు అని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఎన్టీఆర్ హామీలను తుంగలో తొక్కిన మాయావి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, 104, విద్యార్థులకు స్కాలర్‌షిప్, జలయజ్ఞం వంటి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని కొనియాడారు.

అదే చంద్రబాబు పేరు చెబితే దోపిడీ, దౌర్జన్యం, మోసం, వెన్నుపోటు, అవినీతి వంటివి గుర్తుకొస్తాయని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెడ్డి నవరత్నాలు వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. నేడు సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అని మోసపు హామీలు ఇచ్చి, నేడు సూపర్ సిక్స్ పథకం పేరు వింటుంటే భయం వేస్తోందని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదని అని అనడంతో చంద్రబాబు నైజం మరొకసారి నిరూపితమైందని ఆయన విమర్శించారు. ఇకనైన రాష్ట్ర ప్రజలు చంద్రబాబు చేస్తున్న మోసాన్ని గుర్తించి రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆదరించాలని నారాయణ స్వామి పిలుపునిచ్చారు.


వీఓఏలపై వేధింపులు మానుకోవాలి

– కలెక్టరేట్ ఎదుట వీఓఏలు రెండో రోజు దీక్ష


చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వెలుగు వీఓఏ (యానిమేటర్స్) పై అధికార పార్టీ రాజకీయ వేధింపులు మానుకోవాలని ఏపీ వెలుగు (యానిమేటర్స్) అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు హెచ్చరించారు. ఈ మేరకు డిమాండ్ల పరిష్కారం కోసం ఆ సంఘం నేతలు మంగళవారం (రెండవ రోజు) సామూహిక దీక్ష చేపట్టారు. వీఓఏలకు ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం మరిచి పోవడం దుర్మార్గమన్నారు. ఆరు నెలలుగా జీతం ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టిచాకిరి అవుతుందన్నారు. పోరాటానికి పిలుపునిచ్చిన సందర్భంగా రెండు నెలలు వేతనాలు వేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు. పోరాడితే కానీ జీతాలు ఇవ్వరా అని ప్రశ్నించారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. డిసెంబర్ 16వ తేదీన సెర్ప్ సీఈఓ సమక్షంలో జరిగిన చర్చలు, నిర్ణయాలు ఇంత వరకు అమలు కాకపోవడం శోచనీయమన్నారు. అక్రమంగా తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమన్నారు. మహిళా మార్టులలో బలవంతపు కొనుగోళ్ల వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. ఈ దీక్షలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జీను రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, నాయకులు, వివోఏలు పాల్గొన్నారు.

బొలెరో, ద్విచక్ర వాహనం ఢీ

- చికిత్స పొందుతూ ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన మణెప్ప



చికిత్స పొందుతున్న ఎల్లప్ప

పెద్దపంజాణి : మండలంలోని రాయలపేట–పెనుగొలకల మార్గంలోని జిట్టంవారిపల్లి బస్‌స్టాప్ సమీపంలో బొలెరో , ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. పెనుగొలకల గ్రామానికి చెందిన కాకెన్న కుమారుడు ఎల్లప్ప, వెంకటస్వామి కుమారుడు మణెప్ప సొంత పనుల నిమిత్తం రాయలపేట గ్రామానికి వచ్చి పనులు పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామమైన పెనుగొలకలకు వెలుతున్నారు. ఈ క్రమంలో పెద్దఉప్పరపల్లి నుంచి తమిళనాడుకు మామిడి కాయల లోడ్‌తో వెలుతున్న బొలెరో వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని జిట్టంవారిపల్లి సమీపంలో ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వీరిని స్థానికులు, కుటుంబికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మణెప్ప మృతి చెందాడు. పెద్దపంజాణి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంట్లో చోరీ

– బంగారు, వెండి, నగదు అపహరణ

గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని దిగువూరు గ్రామంలో మంగళవారం చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు దిగువూరులో నివాసం ఉండే గోపాలమ్మ కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తున్నాడు. స్వగ్రామమైన జీడీ నెల్లూరుకు అప్పుడప్పుడు వచ్చి వెళుతుండేవారు. మంగళవారం ఉదయం ఎదురింటికి చెందినవారు గోపాలమ్మ ఇంటికి తాళం లేకపోవడం గమనించడంతో బెంగళూరులో ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా స్థానిక పోలీసులకు గోపాలమ్మ బంధువులు ఫిర్యాదు చేశారని తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ శ్రీనివాసంతి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుల బంధువుల, గోపాలమ్మ, భాను ప్రకాష్‌తో చరవాణిలో మాట్లాడిన సమాచారం మేరకు బంగారు, వెండి నగదు చోరీ జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందించారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చోరీ జరిగిన గోపాలమ్మ నివాసం

అంత్యక్రియలకు రూ.15 వేలు

చిత్తూరు కలెక్టరేట్ : సర్వీసులో ఉంటూ మృతి చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్‌ల అంత్యక్రియలకు రూ.15 వేలు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు జిల్లా ఐసీడీఎస్ కార్యాలయం కు చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు మరణించిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు చెందిన చట్టబద్ధమైన వారసులకు రూ.15 వేలు అందజేయాలని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నా యి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,278 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.70 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విద్యార్థి బలవన్మరణం



మహేష్ బాబు (ఫైల్)

పాలసముద్రం : కడుపు నొప్పి తాళలేక పదో తరగతి విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా.. మండలంలోని గంగమాంబపురం పంచాయతీ బలిజూరు గ్రామానికి చెందిన నరసింహులు కూమారుడు మహేష్ బాబు(14) తిరుమలరాజుపురం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. మహేష్ చాలా రోజులుగా పాఠశాలకు సరిగా వెళ్లడం లేదు. దీంతో తండ్రి పాఠశాలకు వెళ్లి పదో తరగతైనా పాస్ కావాలని మందలించాడు. దీంతో రెండు రోజుల నుంచి విద్యార్థి భోజనం చేయకుండా.. ఎవరితో మాట్లాడకుండా ఉండిపోయాడు. ఈ క్రమంలో అతనికి కడుపు నొప్పి ఎక్కువ అయ్యింది. ఆ బాధ భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. బంధువులు గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహన్ని బంధువులకు అప్పగించారు.